
క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

నాయుడుపేటటౌన్: నాయుడుపేటలోని కేకే కల్యాణ్ సదన్‌లో శనివారం ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం జరుగుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి శుక్రవారం తెలిపారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అధ్యక్షతన ఏపీకి జగనే ఎందుకు అనే కార్యక్రమంపై మండల, పట్టణ పరిధిలోని నాయకులతో ఈ సమావేశం జరుగుతుందన్నారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఘనంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామంలో జరుగుతున్న వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ఏకాంత సేవతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతర కోలాహలం


మనులాలాపేట పోలేరమ్మ


బొప్పాపురం పోలేరమ్మ

వెంకటగిరిరూరల్: పోలేరమ్మ ప్రధాన జాతర వెంకటగిరిలో మాత్రమే కాకుండా బొప్పాపురం, మనులాలాపేటలో బుధ, గురువారాల్లో ఘనంగా నిర్వహించారు. మనులాలాపేటలో ఐదేళ్లకో సారి, బొప్పాపురంలో ఏటా జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఆయా గ్రామాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మద్యం దుకాణం తొలగించాలని వినతి

కోట: పట్టణంలోని దాదరాయిగుంట వద్ద ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వినోద్‌కుమార్‌రెడ్డిని కోరారు. దీనిపై ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ మద్యం దుకాణాన్ని మరో చోటుకు మార్చాలని పలుమార్లు ఎస్‌ఈబీ అధికారులను కోరామన్నారు. ఇప్పటికే ఈ విషయమై పంచాయతీ తీర్మానం చేసి అధికారులకు అందజేశామని తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి తొలగింపునకు కృషి చేస్తామన్నారు. ఉప సర్పంచ్ గాది భాస్కర్, చిరంజీవి, నౌషాద్, వెంకయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దొరవారిసత్రం: దొరవారిసత్రం బీసీ గురుకుల పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు జిల్లా స్థాయి అండర్ 14, 17, 19 కోకో, వాలీబాల్, హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్థానిక ప్రిన్సిపల్ తిరుపతయ్య శుక్రవారం తెలిపారు. గత నెల నెల్లూరులో జిల్లా స్థాయి పోటీ జరిగాయన్నారు. కోకోలో తమ పాఠశాలకు చెందిన రేవంత్, ప్రశాంత్, వాలీబాల్‌లో శ్రీధర్, ప్రేమ్‌కుమార్, హ్యాండ్‌బాల్‌లో హేమంత్, కౌశిక్ సత్తాచాటినట్లు పేర్కొన్నారు. వీరిని ప్రిన్సిపల్‌తో ఏపీటీ సుజీవన్‌రావు, పీఈటీలు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



నాయుడుపేటటౌన్: భీమవరం గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్‌ఈబీ పోలీసులు పట్టుకున్నారు. సమాచారం మేరకు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. సుమారు నాలుగు టన్నుల ఇసుకతో ఉన్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి భీమవరం గ్రామానికి చెందిన ట్రాక్టర్ యాజమాని, డ్రైవర్ పంచేటి పెంచలయ్యను అరెస్టు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్‌ఈబీ పోలీసులు వెంకటేశ్వర్లు, రమణయ్య, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

రిటైర్ట్ తహసీల్దార్ మృతి


నారాయణరావు (ఫైల్)

తడ: రిటైర్ట్ తహసీల్దార్, వైఎస్సార్‌సీపీ నేత టి.నారాయణరావు(70) శుక్రవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తడకండ్రిగ పంచాయతీ, బీఎల్‌పాడు గ్రామంలోని ఆయన నివాసంతో కన్నుమూశారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సంతాపం వ్యక్తం చేశారు.

జగనన్న సురక్ష.. ఆరోగ్యానికి రక్ష


చిట్టమూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు


ఓజిలిలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

- పేద ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత
- ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు

చిట్టమూరు: పేదల ఆరోగ్య శ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. చిట్టమూరు మండలం గునపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను సందర్శించారు. ఆరోగ్య సురక్ష కిట్‌లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా ఇంటి వద్దకే వైద్యం అందించేలా ఆంధ్రప్రదేశ్‌లో ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని అమలు చేసి వైద్య రంగంలో సరికొత్త విప్లవం తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చిప్పల వెంకటయ్య, సర్పంచ్ సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వంకా చెంచయ్య, సుబ్బయ్య పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

కోట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు సూచించారు. కోట మండలం చెందోడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించారు. వైద్యాధికారి నాగరాజు పర్యవేక్షణలో 336 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ భవానీ, సర్పంచ్ మాధవి, నాగూర్‌రెడ్డి పాల్గొన్నారు.

సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

పెళ్లకూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. దిగువచావలి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తహసీల్దార్ రామయ్య, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఎంఈఓ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, ఎంపీటీసీ సభ్యురాలు చింతకాని శ్యామలమ్మ, వైద్యులు చంద్రమోహన్‌రెడ్డి, ఉమా, రాజశేఖర్ పాల్గొన్నారు.

సైదాపురం: మండలంలోని చీకవోలు ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన వైద్య శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాసులు, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు రాజు, సర్పంచ్ వెంకటయ్య పాల్గొన్నారు.

దక్కిలి: మండలంలోని వెలికల్లు సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ రాజశేఖర్, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్ వెంకటరమణయ్య, మండల ఉపాధ్యక్షుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య రంగానికి ప్రాధాన్యం

దక్కిలి: పేదలకు ఆధునిక వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సీఎం అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీపీ గోను రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెట్లూరు జగన్‌మోహన్‌రెడ్డి, చింతల శ్రీనివాసులురెడ్డి అన్నారు. దక్కిలి పీహెచ్‌సీ ఆవరణలో రూ.50 లక్షలతో నిర్మించనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు శుక్రవారం భూమి పూజ చేశారు. ఎంపీడీఓ ప్రసన్నకుమారి, వైద్యాధికారులు స్పందన, బిందు ప్రియాంక, నాయకులు రవీంద్రారెడ్డి, వేణుగోపాల్, నారాయణరెడ్డి, శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: తీర ప్రాంతమైన మీజూరు గ్రామ సచివాలయం పరిధిలో 240 మందికి వైద్య పరీక్షలు చేశారు. సర్పంచ్ ప్రసాద్‌నాయుడు, వైద్యులు తరుణ్‌సాయికుమార్, చైతన్య, తేజస్వి, ప్రతిభ పాల్గొన్నారు.

తడ: మండలంలోని కొండూరు సచివాలయంలో సురక్ష కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. సాధారణ పరీక్షలతో పాటు వృద్ధులకు కంటి పరీక్షలు చేసి అద్దాలు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు.

ఓజిలి: కర్రబల్లవోలు గ్రామ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ రజనీకాంత్, తహసీల్దార్ శివరామ్‌సుబ్బయ్య, వైస్ ఎంపీపీ ప్రసాద్ నాయుడు, ఖాదర్‌బాషా, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడూరురూరల్: మేకనూరు గ్రామంలో సుమారు 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆయుష్మాన్ భారత్ కార్డులను అందజేశారు. తహసిల్దార్ లీలారాణి, ఈఓపీఆర్‌డీ జితేంద్రకుమార్ పాల్గొన్నారు.


కోట: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్


డక్కిలి: మందుల పంపిణీ


తడలో..


గూడూరు: అయుష్మాన్ భారత్ కార్డులు అందజేత


పెళ్లకూరులో..


సైదాపురం: కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

జగన్ పక్షానే జనం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

తడ: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు 98 శాతం అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, అబద్ధపు వాగ్దానాలు చేసే చంద్రబాబుకు మధ్య జరిగే ఎన్నికల యుద్ధంలో ప్రజలు జగన్ పక్షాన నిలుస్తారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని శుక్రవారం తడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి అన్న కార్యక్రమానికి సబంధించిన వీడియో ప్రదర్శించి, అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు నెల రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా పని చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కే ఆర్ముగం, జేసీఎస్ మండల కన్వీనర్ ఆర్కే సుందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎం వెంకటకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇందుమతి పాల్గొన్నారు.

రూ.70 కోట్లతో ఆస్పత్రుల నిర్మాణం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

చిల్లకూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో గత నాలుగేళ్లలో గూడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలతోపాటుగా పట్టణంలోని ఆస్పత్రుల నిర్మాణానికి రూ.70 కోట్ల నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. మండలంలోని చేడిమాల సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో కొంతమంది అభివృద్ధి ఎక్కడ? అని ప్రశ్నిస్తున్నారని, అలాంటి వారు కళ్లు పెట్టుకుని చూస్తే ఎంత మేర అభివృద్ధి పనులు జరుగుతాయనే విషయాలను తెలుసుకోవచ్చన్నారు. అనంతరం ఉచిత మందుల కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఏఎంసీ చైర్‌పర్సన్ ఓ యమునమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ఎం శీనయ్య, వైస్ ఎంపీపీ పీ చెంగయ్య, సర్పంచ్‌లు పద్మమ్మ, సుకన్య, పీఏసీఎస్ అధ్యక్షుడు ఆర్ పిచ్చయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దొరవారిసత్రం: మండలకేంద్రంలోని ఆగి ఉన్న లారీని మరో లారీ శుక్రవారం వేకువజామున ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ ధనుంజయ, క్లీనర్ నిరంజన్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్ నుంచి చెన్నైకు వెళుతున్న లారీ టైర్ పంక్చర్ కావడంతో బ్రిడ్జిపై నిలిపేశారు. బీహార్ నుంచి చెన్నైకు ఐరన్ లోడ్‌తో వెళ్లే లారీ ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోగా ముందుగా ఘటన స్థలానికి చేరుకున్న దొరవారిసత్రం 108 సిబ్బంది డ్రైవర్, క్లీనర్‌ను వెలికి తీసి, ప్రథమ చికిత్స చేసి, మెరుగైన చికిత్స కోసం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డివామి దగ్ధం

చిట్టమూరు: కోగిలి పంచాయతీ వేముగుంట పాళెం గ్రామంలో శుక్రవారం ఓ రైతుకు చెందిన గడ్డి వామి దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన యనమల సుబ్బయ్యకు చెందిన గడ్డివామికి నిప్పంటుకుని ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. కోట అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే సుమారు 150 గడ్డి మోపులు కాలిపోయినట్లు పేర్కొన్నారు.

టీడీపీ నేతలు నీచ రాజకీయాలకు వారసులు

- మంత్రి రోజాపై బండారు వ్యాఖ్యలు దారుణం
- ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలి
- నగరి నియోజకవర్గం పార్టీ పరిశీలకుడు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి

పెళ్లకూరు: రాష్ట్రంలో టీడీపీ నేతలు నీచ రాజకీయాలకు వారసులని వైఎస్సార్‌సీపీ నగరి నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పుల్లూరులోని ఆయన నివాసంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మహిళలంటే గౌరవ, మర్యాదలు లేకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడే చెడ్డ సంస్కృతి టీడీపీ నేతలకు అలవాటని మండిపడ్డారు. మంత్రి ఆర్కే రోజాపై టీడీపీ నేత బండారు సత్యనారాయణ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. మంత్రి పదవిలో ఉన్న ఓ మహిళ గురించి ఇంత అసభ్యకరంగా మాట్లాడడం క్షమించరానినేరమన్నారు. ఆయన బహిరంగంగా మంత్రి రోజాకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని చంద్రబాబు దొంగల రాజ్యానికి అధినేతగా వ్యవహరించి కోట్లు సొమ్ము ప్రజాధనాన్ని స్వాహా చేసినట్లు ఆరోపించారు. చంద్రబాబు తనయుడు లోకేష్‌ను కూడా జైలుకు పంపే రోజు, దత్తపుత్రుడు పవన్‌కు నోటి దూల తీర్చే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ఆయన వెంట సునీల్, బత్తెయ్య ఉన్నారు.

స్కూల్ మినీ వ్యాన్ బోల్తా


బోల్తా పడిన వ్యాన్‌ను పైకి లేపుతున్న స్థానికులు


భయందోళనకు గురై రోదిస్తున్న చిన్నారులు

దొరవారిసత్రం: ఓ స్కూల్ మినీవ్యాన్ ప్రమాదవశాత్తు శుక్రవారం బోల్తా పడి, పలువురు విద్యార్థులు స్వల్పగాయలతో బయటపడిన ఘటన శుక్రవారం దొరవారిసత్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. దొరవారిసత్రంలోని విద్యావికాస్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌కు చెందిన మినీ వ్యాన్‌లో చుట్టు పక్క గ్రామాల్లోని విద్యార్థులను రోజులాగానే ఎక్కించుకుని స్కూల్‌కి వస్తున్న సమయంలో దొరవారిసత్రంలో రోడ్డు పక్కనే ఉన్న ముళ్ల చెట్లను డ్రైవర్ తప్పించే క్రమంలో వ్యాన్ అదుపు తప్పి సుమారు 10 అడుగుల ఎత్తు నుంచి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై బోల్తా పడిపోయింది. ఆ సమయంలో వ్యాన్‌లో 20 మంది పైగా విద్యార్థులతో పాటు స్కూల్ కరస్పాడెంట్ సతీమణి కృష్ణవేణి ఉంది. ఈ ప్రమాదంలో పలువురు విద్యార్థులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఏకొల్లు గ్రామానికి చెందిన యూకేజీ చదివే ఎం రాహుల్, వీక్షిత్, రెండో తరగతి విద్యార్థులు గీత, జతిన్‌కు స్వల్పగాయాలు కావడంతో డీవీ సత్రం పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ తిరుమలరావు ప్రమాదానికి గురైన వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా అప్పటివరకు ఎంతో ఉత్సాహంగా వ్యాన్‌లో స్కూల్‌కు వెళుతున్న విద్యార్థులు ఉన్నట్టుండి వ్యాన్ బోల్తా పడడంతో ఏమి జరిగిందో తెలియక చిన్నారు బెంబేలెత్తిపోయి, బోరున విలపించారు. స్థానికులు, జాతీయ రహదారి సెఫ్టీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వ్యాన్‌లో నుంచి విద్యార్థులను బయటకు తీశారు.

జగనన్నతోనే పేదల జీవితాల్లో వెలుగులు


సూళ్లూరుపేట: ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య


తడ: కార్యక్రమానికి హాజరైన నాయకులు, వలంటీర్లు

- ప్రభుత్వ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లండి
- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట/తడ/దొరవారిసత్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాకే పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని.. వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన మంచి.. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించి సమ్మతించిన వారి ఇంటిపై పార్టీ జెండాలను ఎగురవేయాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సూచించారు. సూళ్లూరుపేట పట్టణంలోని సత్యసాయి, టీవీ ఆర్‌ఆర్ కల్యాణ మండపాల్లో పాటు దొరవారిసత్రం మైలాంగంలో శుక్రవారం "ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి" కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగనన్న ఆదేశాల మేరకు ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు వివరించారు. జగనన్న అధికారంలో వచ్చిన తరువాత ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని తెలిపారు. అర్హతే ప్రమాణికంగా పథకాలు అందజేశారన్నారు. చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ కేసులపై కోర్టుల నుంచి స్టేలు తెచ్చుకుని గడిపేశారని.. అయితే చేసిన తప్పులు ఊరికే పోవని అన్నారు. స్కిల్ డవలప్‌మెంట్ స్కామ్, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పులు, ఫైబర్‌గ్రిడ్ వంటి స్కాములు బయటకు వస్తున్నాయని అన్నారు. పాపాలు పండి జైలు పాలయ్యారని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, సూళ్లూరుపేట చెంగాలమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు కళత్తూరు శేఖర్‌రెడ్డి, రాజసులోచనమ్మ, పాండురంగయాదవ్, పోలూరు పద్మా మిల్టన్, చిన్ని సత్యనారాయణ, స్వామిరెడ్డి, గోపిరెడ్డి, దువ్వూరు గోపాల్‌రెడ్డి, మందా దేవేందర్‌రెడ్డి, జెట్టి వేణు యాదవ్ పాల్గొన్నారు.

దసరాకు టిడ్కో ఇళ్ల ప్రారంభానికి చర్యలు


అధికారులతో సమీక్షిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: దసరా నాటికి జగనన్న కాలనీ, టిడ్కో ఇళ్ల ప్రారంభానికి చర్యలు తీసుకోనున్నట్లు.. ఆ మేరకు అధికారులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎస్‌జేఆర్ భవనంలో హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎక్కువ శాతం టిడ్కో ఇళ్ల పంపిణీపై ఫిర్యాదులు అందాయని తెలపారు. లబ్ధిదారులకు ఇచ్చిన మాట ప్రకారం దసరా పండగలోపు ఇళ్లు పంపిణీకి సన్నధం కావాలని సూచించారు. ప్రారంభోత్సవానికి మంత్రులు రమేష్, సురేష్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

చిట్టేడులో సామూహిక పొంగళ్లు

కోట: చిట్టేడు గ్రామదేవత చిట్టేటమ్మకు గ్రామస్తులు శుక్రవారం సామూహిక పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజా సామగ్రితో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.


అమ్మవారికి పొంగళ్లు సమర్పించడానికి వెళుతున్న మహిళలు